


# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 15

అతడు: ప్రేమంటే నిజంగా ఏమంటే ఇదంటూ ఎట్టా చెప్పగలం
ఆమె : ప్రేమించే ఎదల్లో ఏముందో పదాల్లో ఎట్టా చూపగలం
అతడు: తొలిచినుకుల తడి ఇదని తొలి కిరణపు తళుకిదని
ఆమె : తొలివలపుల తలపిదని ఎట్టాగ పోల్చడం

ఆమె : ఊటీకైనా చెమటలు పట్టే హీటుంది ఈ ప్రేమలో
అతడు: ఉప్పెనకైనా ఒణుకులు పుట్టే ఊపుంది ఈ ప్రేమలో
ఆమె : వెనుతిరగని వేగాలతో తొలి కదలిక ఏనాటిదో
అతడు: మునుపెరుగని రాగాలతో పిలిచిన స్వరమేమంటదో
ఆమె : జతకుదిరిన క్షణమిదని ముడి బిగిసిన గుణమిదని
అతడు: కథ ముదిరిన విధమిదని ఎట్టాగ తేల్చడం

అతడు: శంకరుడైనా కింకరుడైనా లొంగాలి లవ్ ధాటికి

ఆమె : పండితుడైనా పామరుడైనా పసివాడే సయ్యాటకి

అతడు: తుది ఎరుగని ప్రేమాయణం మొదలెపుడని ఊహించడం

ఆమె : గత చరితల పారాయణం గతులెన్నని వివరించడం

అతడు: పరులెరుగని అనుభవమై పదపదమను అవసరమై

ఆమె : పయనించే ప్రణయరథం ఎటు పరుగు తియ్యునో

(గోవింద గోవిందా చిత్రానికి రాజ్‌కోటి సంగీత సారథ్యంలో బాలు చిత్ర పాడినది)

★★★★ ★★★★

ప్రేమంటే తేనలా తీయగ వుంటుందనువారు
తేనెంటే ఏమిటో తెలియకనే అనివుంటారు
మనసును గిల్లే ముల్లే కాదా ప్రేమ
నిదురను చిదిమే అల్లరి కాదా ప్రేమ
తరుముకు వచ్చే తేనటీగ కద ప్రేమ
తెలియక దిగితే తేలరు అయ్యోరామా
ఏమిటో ప్రేమన్నది- ప్రేమకే తెలియాలి మరి ||ప్రేమ||

కోటి చుక్కలంటె ఆమె రెండుకళ్ళే అంటున్న ప్రేమతో
కొత్తలెక్కలేస్తే ఆమె తప్ప వేరే జనులంటూ ఉండరే
ఎండంటే ఆమె కోపం- నీడంటే ఆమె స్నేహం
వానవిల్లు ఆమె రూపం- లోకమంటె ఆమే అంది ప్రేమ
మతి చెడెనేమో అనుకుంటే ఎవరైనా
చిన్న నవ్వు నవ్వి జాలిపడుతుంది ప్రేమ
ఏమిటో ప్రేమన్నది - ప్రేమకే తెలియాలి మరి ||ప్రేమంటే||

రాసుకుంది మనసు సరికొత్త డైరీ- ఈ ప్రేమ భాషతో
లక్షలాది పుటలు నింపుతుంది డైలీ- ఒక చిన్నమాటతో
ఇష్టాలను మార్చమంటూ కష్టాలను కోరమంటూ
నన్ను నేనే పోల్చనట్టు ఎంత మాయచేసిందో ఈ ప్రేమ
అది చెబుదామని అనుకుంటూనే వున్నా
తను ఎదురైతే ఇంకేదో అంటున్నా
ఏమిటో ప్రేమన్నది- ప్రేమకే తెలియాలి మరి ||ప్రేమంటే||

(హరిశ్చంద్ర చిత్రానికి ఆగోష్ సంగీత సారథ్యంలో మనో పాడినది)

★★★★ ★★★★

గుండెనిండా గుడిగంటలు గువ్వల గొంతులు ఎన్నో మోగుతుంటే
కళ్ళనిండా సంక్రాంతులు సంధ్యాకాంతులు శుభాకాంక్షలంటే....
వెంటనే పోల్చాను నీ చిరునామా- ప్రేమా... ||గుండె||

చూస్తూనే మనసు వెళ్ళి నీ ఒళ్ళో వాలగా
నిలువెల్లా మారిపోయా నేనే నీ నీడగా
నిలువదు నిమిషం-నువు ఎదురుంటే
కదలదు సమయం- కనబడకుంటే..
నువ్వొస్తునే ఇంద్రజాలం చేశావమ్మా
కవ్విస్తూనే చంద్రజాలం వేశావమ్మా
పరిచయమే చేశావే నన్నే నాకు కొత్తగ ఓ ప్రేమ.. ||గుండె||

★★★★ ★★★★

నీ పేరే పలవరించే- నాలోని ఆశలు
మౌనాన్నే ఆశ్రయించే- ఎన్నెన్నో ఊసులు
తెరిచిన కనులే- కలలకు నెలవై
కదలని పెదవే- కవితలు చదివే

ఎన్నెన్నెన్నో గాథలున్న నీ భాషని
ఉన్నట్టుండి నేర్పినావే ఈ రోజుని
నీ జతలో క్షణమైనా బతుకుని చరితగ మార్చేస్తుందమ్మా.. ||గుండె||

(శుభాకాంక్షలు చిత్రంలో కోటి సంగీత సారధ్యం బాలు, రేణుక పాడినది )

★★★★ ★★★★

తమ్ముడు! అరె తమ్ముడూ! ఈ తికమక తెగులే ప్రేమంటే
ఈ తెలియని దిగులే ప్రేమంటే-
నను అడగర చెబుతా డౌటుంటే
నువు బెదరవు కద నా మాటింటే
అమ్మడూ! ఓ అమ్మడూ! నువు మరీ పరాగ్గా వుంటూంటే
నీకు నిదరే సరిగా రాకుంటే- ఏం జరిగిందో తెలియాలంటే
ఆ రహస్యాన్ని చెబుతా వింటే...
కోరస్: మాష్టారు మాష్టారు మంచి లెక్చరు ఇచ్చారు
మాష్టారు మాష్టారు లవ్‌లో మీరు మెగాస్టారు ||తమ్ముడు||

వేల వేల భాషలున్న నేల మీద ఎక్కడైన
ప్రేమగ్రామరొక్కటే లవ్వరూ- ఆ లాంగ్వేజ్ తెలియనిదెవరు
మూగసైగలైన చాలు వేడి వూపిరైన చాలు
గుర్తు పట్టలేరా ప్రేమికులు- అవి అచ్చుతప్పులేని ప్రేమలేఖలు
అమెరికాలో ఇంగ్లీష్ ప్రేమ- ఆఫ్రికాలో జంగిల్ ప్రేమ
ఏకమయ్యే ఏకాంతంలో ఎక్కడైనా ఒకటే ప్రేమ
తమ్ముడు! అరె తమ్ముడూ!
గుడ్డివాడు కుంటివాడు నల్లవాడు తెల్లవాడు
ప్రేమదేశమెళ్ళగానే మానవుడిగ మిగులుతాడు ||తమ్ముడు||

లక్షలాది లక్షణాలు చూపుతున్న ప్రేమకున్న
అక్షరాలు మాత్రం రెండు - అది మహా సముద్రం ఫ్రెండు
సెంచరీల తోటి పెద్ద సీరియల్‌గా సాగుతున్న
మహానవలరా ప్యారు
ఆ స్టోరీ కొట్టదు బోరు
'క' గుణింతం తెలియని వారు - కాళిదాసులు ఐపోతారు
అమ్మడూ! ఓ అమ్మడూ! లబ్‌డబ్ హార్టుబీటు
లవ్ లవ్ అన్నదంటె
హైక్లాస్ లోక్లాసు చూసుకోదు ప్రేమ కేసు ||తమ్ముడు||

(మాస్టర్ చిత్రానికి దేవా సంగీత సారథ్యంలో చిరంజీవి పాడినది)

★★★★ ★★★★

ఆమె: నాలో ఏదేదో ఐపోతున్నది
అతడు: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా
ఆమె : నీ తోడు కోరింది నా ఊపిరి
అతడు: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా
ఆమె : ఈవేళ ఈ సూర్యోదయం- ఇన్నాళ్ళలాగ లేదు కాదా
అతడు: నీలోన ఈ ప్రేమోత్సవం - ఈ రోజె పుట్టినట్టు ఉందా లేదా ||నాలో||

ఆమె : భాష మొత్తమూ మాయమైనదా- గుండెమాట గొంతు దాటిరాదే
కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా
శ్వాసమాత్రమూ గేయమైనదా- హాయి పాటనన్ను మీటుతోందే
కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా
నీలో ఏదో కొత్తకోణం చూసా నువ్వు నువ్వేనా కాళిదాసా!
అతడు: నీవే కదా నిండు ప్రాణం పోసి దాన్ని పెంచావు కన్నె హంసా
ఆమె : ఒక్క మాటే అని కోటి భావాలని
అందజేయాలనే కొత్త పాఠం ఇదే తెలుసా ||నాలో||

అతడు: కన్ను బొత్తిగా చిన్నదైనదా నిన్ను తప్ప ఏమీ చూడలేదే

కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

అతడు: కొన్ని ఏళ్ళగా ముందుకెళ్ళక కాలమంత ఆగిపోయి వుందే

కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

అతడు: ఏతా వాతా దీని వాటం చూస్తే తీయగా వున్న కత్తి కోత

ఆమె : ఇంటా బయటా మొగమాటం పెట్టే తప్పుకోలేని వింత వేట

అతడు: మంచుమంటై ఇలా అంటూకుంటే ఎలా- పంచుకుంటే తనే తగ్గుతుందో ఏమో బహుశా

||నాలో||

(మనసిచ్చిచూడు చిత్రానికి మణిశర్మ సారథ్యంలో బాలు, సుజాత పాడినది)

★★★★ ★★★★

పల్లవి : ఆలయాన హారతిలో- ఆఖరి చితిమంతలలో

రెండింటిలో నిజానికున్నది ఒక్కటే అగ్నిగుణం

ప్రేమ అనే పదాన వున్నదు ఆరని అగ్నికణం

దీపాన్ని చూపెడుతుందో- శాపాన బలిపెడుతుందో

అమృతమో హాలహలమో ఏమో ఈ ప్రేమగుణం

ఏ క్షణాన ఎలాగ మారునో ప్రేమించే హృదయం

ఎండమావిలో ఎంత వెదికినా నీటిచెమ్మ దొరికేనా

గుండెబావిలో ఉన్న ఆశ తడి ఆవిరి అవుతున్నా

ప్రపంచాన్ని మరిపించేలా మంత్రించే ఓప్రేమా

ఎలా నిన్ను కనిపెట్టాలో ఆచూకీ ఇవ్వమ్మా

నీజాడ తెలియని ప్రాణం- చేస్తోంది గగన ప్రయాణం

ఎదర వుంది నడిరేయన్నది ఈ సంధ్యాసమయం ||ఏక్షణాన||

సూర్యబింబమే అస్తమించనిదే మేలుకొని కలకోసం
కళ్ళు  మూసుకొని కలవరించెనే కంటిపాప పాపం
ఆయువిచ్చి పెంచిన బంధం మౌనంలో మసి అయినా
రేయి చాటు స్వప్నం కోసం అలాపన ఆగేనా
పోదేది ఏదేమయినా పోయింది తిరిగొచ్చేనా
కంటిపాప కల అడిగిందని నిదురించెను నయనం ||ఏ క్షణాన||

(సుస్వాగతం చిత్రంలో ఎస్.ఎ. రాజ్ కుమార్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★★ ★★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS